జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం | 29 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 4



# రాగితీగ చోరీకి పాల్పడుతున్న ముఠా అరెస్టు

- కల్లూరు ఏ సీ పీ వసుంధర యాదవ్



**కల్లూరు ఏప్రిల్ 28 : ప్రజా జ్యోతి** విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేసి రాగితీగ చోరీకి పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. వియం.బంజర పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసిపి వెల్లడించిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం వి.యం బంజర ఎస్సై వెంకటేష్ తన సిబ్బంది తో పెట్రోలింగ్ నిమిత్తం లంకసాగర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సత్తుపల్లి వైపు నుండి తిరువూరు వైపు రెండు మోటార్ సైకిళ్ల 1). AP20K 480, 2).AP37AM 3067 పై

మిగతా 2 లో...



# అంతర్జాతీయ ప్రమాణాలతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- జాతీయ స్థాయి పోటీలకు ట్రాక్ ను సిద్ధం చేయాలి
- ఖమ్మం అథ్లెట్ల చిరకాల స్వప్నం సాకారం దిశగా పనులు వేగవంతం
- నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- సర్దార్ పటేల్ స్టేడియంలో ట్రాక్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణంలో ఉన్న అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులను త్వరితగతిన పూర్తి చేసి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంగళవారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న 400 మీటర్ల అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులను మంత్రి పరిశీలించారు.ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి,నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా సింథటిక్ ట్రాక్ ను సిద్ధం చేయాలని

మిగతా 2 లో...

# ఇందిరా మహిళ డెయిరీ విజయవంతం చేసేందుకు సమగ్ర ప్రణాళిక అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్
- ఇందిరా మహిళా డెయిరీపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇందిరా మహిళా డెయిరీని విజయవంతం చేసేందుకు విజయ డెయిరీ నమూనాను అనుసరిస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మంగళవారం కలెక్టరేట్ లో ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ అమలులో వ్యవస్థీకృత విధానాన్ని అనుసరించాలని సూచించారు. విజయ డెయిరీ ప్రతినిధులను కూడా ఆ బోర్డులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. దీనివల్ల మహిళా సంఘాలకు ప్రయోజనం

మిగతా 2 లో...

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రజా దర్బార్

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్య నారాయణ గౌడ్
- జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ప్రజా దర్బార్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ మొదటి సమావేశంలో ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 30 గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి నున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఖమ్మం ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకున్నామని, జిల్లా కాంగ్రెస్ కమిటీ

మిగతా 2 లో...

# మెగా జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలి

- మెగా జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్
- 3200 ఖాళీల భర్తీ లక్ష్యంగా మెగా జాబ్ మేళా
- 80కి పైగా కంపెనీల భాగస్వామ్యంతో భారీ ఉపాధి వేదిక
- జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మెగా జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు .మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమై మే 4న నిర్వహించనున్న జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం

మిగతా 2 లో...

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్ లో ప్రజా దర్బార్

(మొదటి పేజీ తరువాయి...)

కార్యవర్గ సభ్యులు, నగర కాంగ్రెస్ కమిటి కార్యవర్గ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు,శ్రేణులు అందరు పాల్గొని కార్యక్రమమును విజయవంతం చేయగలరని పత్రికాముఖంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు.

## ఇందిరా మహిళ డెయిరీ విజయవంతం చేసేందుకు సమగ్ర ప్రణాళిక అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

చేకూరడమే కాకుండా, కార్యక్రమం సమర్థవంతంగా నడుస్తుందని అన్నారు .ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తుండగా,ఇందిరా మహిళా డెయిరీ ద్వారా దశల వారీగా 40 వేల లబ్ధిదారులకు పశువులు పంపిణీ చేసి, రోజుకు 80 వేల లీటర్ల పాలు సేకరించే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.విజయ డెయిరీ నమూనాను ప్రతిరూపంగా తీసుకుని,అవసరమైన విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని,రిటైర్డ్ ఉద్యోగుల మార్గదర్శకత్వాన్ని వినియోగించు కోవాలని సూచించారు. శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రతి నిర్ణయాన్ని లిఖిత పూర్వకంగా అమలు చేయాలని ఆదేశించారు.ఎన్ఆర్ఈజీఎస్ నిధులను లబ్ధిదారుల పశువుల షెడ్ల నిర్మాణానికి వినియోగించే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పశువుల కొనుగోలు లబ్ధిదారుల ఆమోదంతోనే జరగాలని, కొనుగోలు మార్గదర్శకాలపై ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.బీఎంయూ స్థాయిలో విజయ డెయిరీ సిబ్బంది నమూనాను అనుసరించి,అదే విధానాన్ని ఇందిరా మహిళా డెయిరీలో అమలు చేయాలని, మహిళలు వివిధ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ మొత్తాన్ని సకాలంలో జమ చేయడానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, లబ్ధిదారుల కోసం నాన్–ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాలను ప్రారంభించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.రాష్ట్రానికి రోజు ఇతర రాష్ట్రాల నుంచి అనేక లీటర్ల పాలు దిగుబడి అవుతున్నాయని,వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరా మహిళా డెయిరీ పశువుల పంపిణీ ద్వారా ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే పాలను సమర్ధవంతంగా సేకరించేలా అవసరమైన ఒప్పందాలు కుదుర్చుకుని,దశలవారీగా పాల ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ,ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు అమలు విధానంపై వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ప్రాజెక్టు విజయవంతం కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఓ.,ట్రైబల్ వెల్ఫేర్,బిసి,ఎస్సీ,మైనారిటీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు,ఏపిఎం., సంబంధిత మండల ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగాలం శ్రమ పై నీలిమేఘాల నీడ

- **వేగంగా కాటాలు వేయాలని రైతుల వినతి**



**కల్లూరు, ఏప్రిల్ 28 : ప్రజా జ్యోతి** ఆకాశం ఉరుముతోంది మబ్బులు కమ్ముతున్నాయి వాన చినుకు రైతన్న గుండెలో గుబులు పుట్టిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లాల్లో రాశులుగా ఉంది. చేతికందే దశలో ప్రకృతి కన్నెర్ర చేస్తోందా అనే భయం రైతులను వెంటాడుతోంది. గత కొన్ని రోజులుగా డీజిల్ కొరతతో ధాన్యం ఎగుమతి నెమ్మదించింది. లారీలు నిలిచిపోయాయి. మిల్లులకు వెళ్లాల్సిన ధాన్యం కళ్లాల్లో నే పేరుకుపోయింది. ఇప్పుడిప్పుడే డీజిల్ పరిస్థితి కుదుటపడుతోందని ఊపిరి పీల్చుకునే లోపే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈరోజు, రేపు జిల్లాలో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే కోతలు పూర్తయి కళ్లాల్లో, కాటాలు వద్ద ధాన్యం రాశులు ఉన్నాయి. ఒక్క వాన పడితే చాలు. నెలల శ్రమ నీటిపాలవుతుంది. ధాన్యం తడిస్తే రంగు మారి, మొలకెత్తి మద్దతు ధర రాదు. మిల్లర్లు కొనడానికి ముందుకు రారు. ఇది కేవలం పంట నష్టం కాదు. రైతు కుటుంబానికి జీవనాధారం మీద మోయలేని భారం. పెట్టిన పెట్టుబడి, చేసిన అప్పు, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు అన్నీ ఆ ధాన్యం రాశిపై నే ఆధారపడి ఉన్నాయి. అధికారులు వీలైనంత త్వరగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మెగా జాబ్ మేళాతో నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అందులో మెగా జాబ్ మేళా ఒక ముఖ్య కార్యక్రమమని పేర్కొన్నారు. జాబ్ మేళా ద్వారా మొత్తం 3200 ఖాళీలను భర్తీ చేయనున్నామని, సుమారు మూడు రెట్లు అంటే 10 వేల మంది యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మెగా జాబ్ మేళా నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించి, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సరైన వేదికను ఎంపిక చేయాలని ఆదేశించారు .యువతను పెద్ద ఎత్తున సమీకరించేలా ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ చానెల్స్, పత్రికలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.మెగా జాబ్ మేళాలో 80కి పైగా కంపెనీలు పాల్గొననున్నందున, వేదిక ఎంపికకు ముందు పోలీసు శాఖతో సమన్వయం చేయాలని,ప్రతి జిల్లాఅధికారి తనకు కేటాయించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.వేదిక విశాలంగా ఉండి, వేచి ఉండే ప్రదేశం, కూర్చునే సదుపాయాలు,కంపెనీల స్టాల్స్ ఏర్పాటు చేసుకునే స్థలం ఉండాలని, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా ఉండాలని తెలి పారు. తాగునీరు,ఈవెంట్ కోఆర్డినేటర్లు, దిశా నిర్దేశక బోర్డులు, సైన్ బోర్డు లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మెగా జాబ్ మేళా వేదికలో హై స్పీడ్ ఇంటర్నెట్ ,సాంకేతిక సిబ్బంది, కంప్యూటర్లు ,ల్యాప్‌టాప్‌లు వంటి ఐటీ మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, సరిపడా పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణంలో వాట్సాప్ గ్రూపులు,సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, క్యూ ఆర్ కోడ్ ద్వారా కంపెనీల వివరాలు, ఖాళీల సంఖ్య, అర్హతలు వంటి పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలని తెలిపారు. టి ఏ ఎస్ కే ద్వారా 80కి పైగా కంపెనీలు ఉదయం సమయానికే వేదికకు చేరుకునేలా చూడాలని,నగరంలో వసతి వంటి సదుపాయాలు సమకూర్చాలని సూచించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని సూచించారు.అభ్యర్థుల నమోదు, ఇంటర్వ్యూ ల నిర్వహణ, కంపెనీల సమన్వయం, యువత సమీకరణ వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళిక తో వ్యవహరించాలని తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డివైఎస్ఓ సునీల్,ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ డబ్ల్యూ.జె. ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ ఇండస్ట్రీస్ ఈ. నకుల్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుమాధవ్, ఈడీఎం దుర్గ ప్రసాద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాగితీగ చోరీకి పాల్పడుతున్న ముఠా అరెస్టు




(మొదటి పేజీ తరువాయి...)

నలుగురు వ్యక్తులు వారి మధ్యలో సూపర్ సంచి మూటలు పెట్టుకొని అనుమానస్పదంగా వస్తున్న వారిని అపి తనిఖీ చేయగా రాగి తీగల కట్టలు ఉన్నట్లు గుర్తించి అదుపులో తీసుకుని విచారించినట్లు తెలిపారు. నిందితుల నుండి 200 కేజీల రాగి తీగ, రెండు వ్యవసాయ మోటర్లు, రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. విచారణలో ప్రధాన నిందితుడైన చల్లా దశరథ రాజ్ అలియాస్ దశరథుడు అనే వ్యక్తి గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల లోనూ పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇండ్లలో దొంగతనాలు, ట్రాన్స్ఫార్మర్ల నుండి కాపర్ వైర్ చోరీ కేసులలో 50కి పైగా కేసులలో నిందితుడని, పలుమార్లు పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ అతడు ప్రవర్తన మార్చుకోకుండా అలాగే దొంగతనాలు చేస్తూ ప్రజా శాంతికి భంగం కలిగిస్తుండటంతో గతంలో అశ్వరావుపేట పోలీస్ స్టేషన్ లో పీడీ యాక్ట్ అమలు చేయడం జరిగిందని అన్నారు. పీడి యాక్ట్ నుండి బయటకు వచ్చిన తర్వాత కూడా ప్రవర్తన మార్చుకోకుండా 2025 సంవత్సరంలో ఫిబ్రవరి నెల నుండి తన అనుచరులు అయిన అల్లం శివ, ముల్లగిరి రామకృష్ణ, ముదరబోయిన ఏడుకొండల తో కలిసి ఒక గ్యాంగ్ ను ఏర్పాటు చేసుకుని వీరు సాయంత్రం సమయంలో వెళ్లి పొలాల్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్లను ఎంచుకొని రాత్రి అయిన తర్వాత మోటార్ సైకిల్ పై అక్కడికి వెళ్లి ట్రాన్స్ఫార్మర్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్ ను తొలగించి తమ వద్ద ఉన్న పనిముట్లతో ట్రాన్స్ఫార్మర్ ఓపెన్ చేసి అందులో ఉన్న కాపర్ తీగలు తీసుకుని వెళ్లి అశ్వరావుపేట పట్టణంలో ఉన్న స్క్రాప్ షాప్ యజమానులైన నర్సుల గౌరీ, కాటి మంగారెడ్డి, పద్దం రవికుమార్, కొనకల్ల సత్యనారాయణ రావులకు అమ్మివచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారని తెలిపారు. మొత్తంగా 7 పోలీస్ స్టేషన్ పరిధిలో (45) ట్రాన్స్ఫార్మర్ల నుండి కాపరు వైరు, రెండు ఎలక్ట్రికల్ మోటర్లు దొంగతనం చేయడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో అశ్వరావుపేట స్కాప్ షాపుల వద్ద పోలీసుల నిఘ పెరగడంతో ఈరోజు కాపర్ వైర్లు తిరువూరులో ఏదైనా షాపులలో విక్రయించేందుకు కాపర్ వైర్ బస్తాలను మోటార్ సైకిల్ పై పెట్టుకుని తిరువూరు వస్తుండగా లంకా సాగర్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసు వారు పట్టుకున్నారు. నిందితులు ఫిబ్రవరి నెల 2025 సంవత్సరం నుండి ఇప్పటివరకు వియం బంజర పోలీస్ స్టేషన్ పరిధిలో 4 ట్రాన్స్ఫార్మర్లు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ట్రాన్స్ఫార్మర్లు, వేంసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ట్రాన్స్ఫార్మర్లు, 2 ఎలక్ట్రికల్ మోటర్లు, ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 ట్రాన్స్ఫార్మర్లు, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 02 ట్రాన్స్ఫార్మర్లు, జంగారెడ్డిగూడెం పరిధిలో 01 ట్రాన్స్ఫార్మర్, కొయ్యలగూడెం పరిధిలో 01 ట్రాన్స్ఫారం, మొత్తంగా 07 పోలీస్ స్టేషన్ పరిధిలో 45 ట్రాన్స్ఫార్మర్ల నుండి కాపరు వైరు, రెండు ఎలక్ట్రికల్ మోటర్లు దొంగతనం చేయడం జరిగింది. నిందితులు పంటల సమయంలో ట్రాన్స్ఫార్మర్లలో ఉన్న కాపర్ వైర్ దొంగతనం చేస్తూ రైతులకు తీవ్ర సౌకర్యం కల్పించడంతో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీరిపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి సిఫార్సు చేయబడుతుందని తెలిపారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులకు ఆదేశించారు.ఖమ్మం జిల్లాలో క్రీడా వసతులను మెరుగు పరచడం ద్వారా జాతీయ స్థాయి పోటీలను నిర్వహించే స్థాయికి తీసుకెళ్లాలని, దీని ద్వారా స్థానిక అథ్లెట్లకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఖమ్మం అథ్లెట్ల చిరకాల స్వప్నమైన సింథటిక్ ట్రాక్ నిర్మాణం త్వరలోనే పూర్తి కావాలని ఆకాంక్షించారు.అనంతరం మంత్రివర్యులు ఖమ్మం నగరం 18వ డివిజన్ లో పర్యటించి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, శ్రీ రామ్ హిల్స్ లో కోటి 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ అధికారులు, జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి,సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో జాతీయ కుటుంబ ప్రయోజత పథకం.... కమిషనర్ నరసింహ



**సత్తుపల్లి ఏప్రిల్28(ప్రజా జ్యోతి)** గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశానుసారము జాతీయ కుటుంబ ప్రయోజిత పథకం ఎన్.ఎఫ్.బి.ఎస్ వయస్సు 18నుండి 59 కలిగి తేది 13 ఏప్రిల్ 2017 తరువాత భర్త చనిపోయిన వితంతు మహిళలకు (20,000/ ఇరవై వేలరూపాయలు జాతీయ కుటుంబ ప్రాయోజతా పథకం ఒక్కసారి ఆర్థిక సహాయం పథకం నకు మీసేవ ద్వారా ఆన్లైన్ చేసుకొని,సంబందిత ధరఖాస్తు తో పాటు ఈ దిగువ తెలిపిన పత్రాలు జతపరచి మున్సిపల్ కార్యాలయం నందు సమర్పించ గలరు. జాతీయ కుటుంబ ప్రయోజిత పథకం ధరఖాస్తు ,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో,రేషన్ కార్డు జీరాక్స్ కాపీ, మరణ ధృవీకరణ పత్రం జీరాక్స్ కాపీ,చనిపోయిన వారి వయస్సు ధ్రువీకరణ జీరాక్స్ కాపీ,చనిపోయిన వారి ఆధార్ కార్డ్ జీరాక్స్ కాపీ,ధరఖాస్తు దారుని ఆధార్ కార్డ్ జీరాక్స్ కాపీ,ఆధాయ ధృవీకరణ పత్రం జీరాక్స్ కాపీ,కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం జీరాక్స్ కాపీ,బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీ జీరాక్స్ కాపీలు జత చేసి, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమర్పించవలెనని కమిషనర్ నరసింహ తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అవకాశం ఉన్నవాళ్లు సద్వినియోగం చేసుకొని,ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# ప్రజల పక్షాన పోరాటంలో కమ్యూనిస్టులే ముందు

- సుశీలమ్మ త్యాగం మరువలేనిది
- సుశీలమ్మ వర్ధంతి సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి



**బోనకల్, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):** ప్రజల పక్షాన పోరాటం చేయడంలో కమ్యూనిస్టులే ముందుంటారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాయన్నపేట మాజీ సర్పంచ్, సిపిఐ నాయకురాలు, అమరజీవి తూము ప్రకాశరావు సతీమణి తూము సుశీలమ్మ మొదటి వర్ధంతి సభను ఆ గ్రామంలో తూము ప్రకాష్ భవన్లో జరిపారు. సుశీలమ్మ వర్ధంతి సభకు జమ్ముల జితేందర్ రెడ్డి హాజరయ్యారు . ముందుగా సుశీలమ్మ చిత్రపటానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ... సిపిఐ పార్టీకి సుశీలమ్మ త్యాగం, చేసిన సేవలు మరువలేనిదని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకు నిగా పేదల హక్కుల కోసం ముఖ్యంగా భూ పంపిణీ కోసం ప్రకాశ రావు చేసిన పోరాటంతో అనేక మంది భూములు పంపిణీ చేశారన్నారు. కలకోట చెరువుపై హక్కులు పేదలకు చెందాలని ప్రకాశ రావు తుదిశ్వాస వరకు పోరాడారన్నారు. ఆయన అమరత్వం తర్వాత సుశీలమ్మ గ్రామ సర్పంచ్ గా, సిపిఐ నాయకురాలిగా కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచారని ఆ అమర దంపతుల వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలిచదన్నారు. కుటుంబ సభ్యులు విభిన్న రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం, ఆదర్శనీయమని జమ్ముల తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకాష రావు, సుశీలమ్మ ల స్ఫూర్తి తో మరిన్ని భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకాల న్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడటంలో కమ్యూనిస్టులే ముందు వరుసలో నిలుస్తున్నారని ఆయన తెలి పారు. అనేక కార్మిక, కర్షక చట్టాలు ఎర్రజెండా పోరాట ఫలితంగానే దక్కాయన్నారు. అధికారం లేకపోతే అనేక పార్టీలు కనుమరుగయ్యాయని అధి కారం ఉన్నా లేకున్నా 100 సంవత్సరాల నుంచి ప్రజల మధ్యలో అజేయంగా నిలిచిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేన న్నారు. సిద్ధాంత బలమే శతాబ్ద కాలంగా కమ్యూనిస్టు పార్టీని నిలబెడు తుందని కమ్యూనిజం అజరామరం, విశ్వ వ్యాప్తమని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ దాని ప్రజా సంఘాలు ఇప్పటికీ అలుపెరు గని పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తూము కోటయ్య, గిరీషమ్మ, సిపిఐ శాఖ కార్యదర్శి ఏలూరి పూర్ణ చందు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బొమ్మినేని కొండలరావు, తోటపల్లి ఆనందరావు, పల్లెబోయిన వీరభద్రం, మహిళా నాయకురాలు మరీదు ఈశ్వరమ్మ, సొసైటీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగనవాడి పాఠశాలను పరిశీలించిన ఎంపీ ఓ



**కారేపల్లి, ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి గ్రామంలో గల అంగన్వాడి పాఠశాలను మంగళవారం మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల యొక్క హాజరు శాతన్ని,పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారికి వారి మెనూ ప్రకా రం భోజనం, చిరుధాన్యాలు, స్నాక్స్ అందిస్తున్నారా అని అంగన్వాడి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి కేంద్ర పరిసరాల పరిస్థితి క్షు ణ్ణంగా పరిశీలించి మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎస్. నరేంద్రరావు,సర్పంచ్ పూసం ఎల్ల య్య, ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె. అనుష, అంగన్వాడి టీచర్లు నాగమణి, విజయ, లక్ష్మి, ఆయా మహిముదా గ్రామపంచాయతీ సిబ్బంది నూకుల నగేష్, పాషా, మూడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరుకు స్థల పరిశీలన



**బోనకల్, ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలో ప్రజల తాగు నీటి సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా మంగళవారం బోనకల్ గ్రామంలోని మొదటి వార్డులో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు బోర్‌వెల్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ బానోతు కొండ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన కొండ వేసవి కాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సరైన ప్రదేశంలో బోర్ వేయించి ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.స్థల పరిశీలన కార్యక్రమంలో ఎర్నెస్ట్ పాల్, గ్రామ పెద్దలు యార్లగడ్డ రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామంలో నీటి కొరతను పూర్తిగా నివారించేందుకు బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం తీసుకుంటున్న చొరవకు అభినందనలు తెలియజేశారు.

## పరీక్షా ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- ఆందోళనకు తావు ఇవ్వవద్దు
- ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. డి. రామారావు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

స్థానిక పదవ తరగతి పరీక్షల ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో,ఖమ్మం జిల్లా విద్యార్థులు,తల్లిదండ్రులకు ముఖ్యంగా ఫలితాల కారణంగా ఎటువంటి ఆందోళన, నిరాశ , లేదా తీవ్రమైన నిర్ణయాలు తీ సుకో వద్దు.విద్యార్థులకు ముఖ్య సూచనలు: పరీక్షా ఫలితాలు మీ జీవితాన్ని నిర్ణయించవు.ఫలితాలు కేవలం ఒక అంకె మాత్రమే అవి మీ మొత్తం ప్రతిభను తెలియజేయవు.ఆశించిన ఫలితం రాకపోతే అది ఓటమి కాదు, ఒక పాఠం మాత్రమే. జీవితంలో విజయానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఒక పరీక్ష మాత్ర మే అంతిమం కాదు. మీలో ఉన్న నైపుణ్యాలు,పట్టుదల,కృషి మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి.ఒత్తిడిగా అనిపించినప్పుడు ఒంటరిగా ఉండకుండా,తల్లిదండ్రులు లేదా స్నేహితులతో మాట్లాడండి.మీ ఆరోగ్యం అత్యంత విలువైనది. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకండి.తల్లిదండ్రులకు ముఖ్య సూచనలు: పిల్లలపై అనవసర ఒత్తిడి చేయవద్దు.ప్రేమతో,సహనంతో మాట్ లాడండి. ఫలితాల ఆధారంగా పిల్లలను మందలించడం లేదా ఇతరులతో పో ల్చడం చేయవద్దు. పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకొని,ధైర్యం చెప్పండి. ఒకవేళ ఫలితాలు అనుకూలంగా రాకపోతే, అది జీవితాంతం ప్రభావం చూపదని వివరించండి.పిల్లలు నిరాశలో ఉన్నట్లు గమనిస్తే వెంటనే వారితో మాట్లాడి, అవసరమైతే నిపుణుల సహాయం పొందండి. పిల్లలకు భవిష్యత్తులో ఉన్న ఇతర అవకాశాల గురించి అవగాహన కల్పించండి.అత్యవసర సహాయం,తప్పనిసరిగా వినియోగించండితీవ్రమైన ఆందోళన, నిరాశ , లేదా మనోవేదన అనిపించినప్పుడు వెంటనే టెలి మానస్ సహాయవాణి 14416 కు కాల్ చేయండి.ఈ సేవ ద్వారా నిపుణులైన మానసిక వైద్యులు ఉచితంగా సలహాలు అందిస్తారు. మీ పట్టుదల,కష్టం,ఆత్మవిశ్వాసం మాత్రమే మీ విజయాన్ని నిర్మిస్తాయి. ధైర్యంగా ఉండండి.మీ జీవితం అమూల్యం అన్నారు.

## మేమున్నాం స్వచ్ఛంద ద్వారా మజ్జిగ పంపిణీ



**సత్తుపల్లి ఏప్రిల్28(ప్రజా జ్యోతి )**మేమున్నాం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా యోగ బృంద సభ్యుల సహకారంతో,వేసవి నేపథ్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు యోగా గురువు, సేవా సంస్థ నిర్వాహకుడు వెదుళ్ల వీరబాబు తెలిపారు. సత్తుపల్లి బస్టాండ్ సెంటర్ తో పాటు పాత సెంటర్లో దాదాపు 650 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కొంతమేరకు వారికి ఉపశమనం కలిగేందుకు ఈ మధ్యకి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినామని, ప్రజలు కొంతమేరకు మజ్జిగ పంపిణీ వలన ఊరట చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, శైలజ, సునీత, అభిద్, ఇమామ్, నరసింహారావు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు పొందిన బహుజన జానపద యుద్ధనౌక పమ్మి రవి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్ లు శాలువా పూలదండలతో సన్మానించారు. సామాజిక సేవ తెలంగాణ ధూంధాం ఆటపాటల తో ప్రజలకు అవగాహన కల్పించారని పేర్కొన్నారు. దళితరత్న అవార్డు ప్రకటించిన తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కు ధన్యవాదాలు తెలిపారు. పమ్మి రవికి దళిత రత్న అవార్డు రావటం బహుజనుల ఘన విజయం గా పేర్కొని అభినందనలు తెలిపారు.

## పి.వి.ఎన్.ఆర్ కాలనీలో హాకీ కోచింగ్ సెంటర్



**సత్తుపల్లి ఏప్రిల్ 28(ప్రజా జ్యోతి )**సింగరేణి పి.వి.ఎన్.ఆర్ కాలనీ లో వేసవి సెలవుల దృష్ట్యా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సూచనల మేరకు,వెల్ఫేర్ ఆఫీసర్ కావ్య పిల్లల కోసం హాకీ కోచింగ్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలు సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, క్రీడల ద్వారా శారీరక,దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతాయని తెలిపారు. హాకీ వంటి క్రీడలు భవిష్యత్తులో మంచి అవకాశాలకు దారితీస్తాయని, పిల్లలు ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు,తల్లిదండ్రులు పాల్గొని ఇలాంటి కార్యక్రమం చేయడం పట్ల వారిని అభినందించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఐ.ఎన్.టి.యుసి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరావు, ఏ.ఐ.టి.యు.సి బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్, హాకీ కోచ్ రాజకుమార్ యూనియన్ నాయకులు, కాలనీ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఆత్మవిశ్వాసంతోనే సమస్యలను పరిష్కారించే దిశగా బాలికలు అడుగులు వేయాలి :ఎస్సై



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాఠశాల స్థాయిలో బాలికలకు భద్రత కల్పించాలన్నఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన బాలిక సాధికారత సంఘాల కార్యాచరణలో భాగంగా పాఠశాలల్లో బాలికల రక్షణకు బలమైన భరోసాను కల్పించేందుకు ప్రియదర్శి కళాశాల,తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సీ డిగ్రీ కళాశాల, జెఏన్టియు కాలేజ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. లైంగిక దాడులనుఅరికట్టడంతోపాటు,బాల్య వివాహాలు, లింగ వివక్ష వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా విద్యార్థినులకు ధైర్యాన్ని, చట్టపరమైన అవగాహనను అందిస్తున్నామని తెలిపారు.లైంగిక వేధింపులు,దూషణలు,బెదిరింపులు, ఈవ్‌టీజింగ్,అనుచిత ప్రవర్తన తదితర ఘటనలు జరిగినప్పుడు బాలికలు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేసి రక్షణ పొందేలా చైతన్యం రావాలని అన్నారు. పాఠశాలల్లో స్వేచ్ఛాయుత,సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పడం ద్వారా బాలికలు ధైర్యంగా చదువుకునేలా సాధికారత కమిటీలు కృషి చేస్తున్నాయని అన్నారు.

## ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు

- వేంసూర్ గ్రామ సర్పంచ్ పక్కృద్దీన్



**వేంసూరు ఏప్రియల్ 28 ప్రజాజ్యోతి**వేంసూరు గ్రామంలో అభివృద్ధి పనులకు వేగం పెరుగుతోంది. గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయి. ఈ సందర్భంగా రాళ్లచెరువు అలుగు మరియు లింకు కెనాల్ (కట్టు కాలువ)లో పెరిగిన జంగిల్‌ను తొలగించే పనులను సర్పంచ్ గారు స్వయంగా పర్యవేక్షిస్తూ కార్మికులతో కలిసి ముందుకు తీసుకెళ్తున్నారు.ఈ పనుల ద్వారా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు, సాగు భూములకు నీటి సరఫరా సులభతరం కానుంది. అలాగే కాలువల్లోని మురుగు, మొలిచిన మొక్కలను తొలగించడం వల్ల నీటి ప్రవాహం సజావుగా సాగి, వరదల సమయంలో వచ్చే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామంలోని కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ అభివృద్ధి కూడా సాధ్యమవుతోంది.గ్రామ ప్రజలు సర్పంచ్ కృషిని అభినందిస్తూ, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు కూడా పనులను తరచుగా పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటించాలనీ సూచిస్తున్నారు.

## ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్ కు శుభాకాంక్షలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ఖమ్మం జిల్లాకు నూతనంగా విచ్చేసి పదవి బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దివాకర్ టి ఎస్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవో ఇరిగేషన్ ప్రాజెక్టు మెయింటినెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బజ్జూరి రమణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమపొంగు శ్రీనివాస్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాటి మల్లారెడ్డి ఇరిగేషన్ జిల్లా ఆఫీస్ ఇంచార్జ్ సూరిబాబు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# లింగ వివక్ష, సమానత్వం మరియు బాధ్యత పై అవగాహన

- ఖమ్మం పోలీస్ కమిషనర్ శ్రీ సునీల్ దత్ ఆదేశాల ప్రకారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం ఇన్స్పెక్టర్ శివ నాగుల శ్రీనివాస్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పోలీస్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ విద్యాసంస్థల లోని బాలలకు యువతీ యువకులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ శివనాగుల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మద్దులపల్లి లోని నర్సింగ్ కళాశాలలో దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో, బల్లేపల్లి నందు గల కిన్నెర నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనేడు మన సమాజం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన నాలుగు అంశాల గురించి చర్చించాల్సిన ప్రాముఖ్యత ఉందని అభిప్రాయపడ్డారు. లింగ వివక్ష నిర్మూలన, సమ్మతి (కాన్సెంట్ ) ప్రాముఖ్యత, సైబర్ భద్రత, మరియు టీనేజ్ దశలోని సవాళ్లు . లింగ వివక్ష, సమ్మతిలింగ వివక్ష అనేది స్త్రీ, పురుషుల మధ్య వివక్ష చూపడం,అవకాశాలను నిరాకరించడం, ఇది సమాజ ప్రగతికి ఆటంకం. మనం ప్రతి ఒక్కరి వ్యక్తిగత హక్కులను గౌరవించాలి; ఏదైనా పనిలో లేదా సంబంధంలో అవతలి వ్యక్తి స్వేచ్ఛా అంగీకారమే ముఖ్యమని గుర్తించాలి అంగీకారం లేనిదే ఏ నిర్ణయమూ తీసుకోకూడదు, ఇది ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని అన్నారు. బాలలు మహిళలు యువతులు ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే డయల్ 100 లేదా షీటీం ను లేదా యాంటీ మన్ ట్రాఫికింగ్ యూనిట్ వారిని సంప్రదించి రక్షణ పొందాలని తెలిపారు.ఏ ఎస్ ఐ జ్యోతి మాట్లాడుతూ సైబర్ రిస్క్ మరియు టీనేజ్ సమస్యలునేటి డిజిటల్ యుగంలో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి, ఎవరికీ తెలియని లింకులు క్లిక్ చేయవద్దు.అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.టీనేజ్ అనేది పిల్లలకు శారీరక, మానసిక మార్పులు జరిగే సున్నితమైన దశ, ఈ సమయంలో తల్లిదండ్రులు మందలించడం కంటే, పిల్లల మాటలను ఓపికగా వినడం ద్వారానే సమస్యలను పరిష్కరించగలం మార్పు మన నుండే మొదలుఈ నాలుగు సమస్యలు మన ఇళ్లలోనే పరిష్కారం కావాలి అని యువతలో స్ఫూర్తి కలిగించారు.ఏ హెచ్ టి యు బాధ్యులు భాస్కర్ మాట్లాడుతూ లింగ వివక్ష రూపుమాపాలంటే ఇంట్లో పనులను అందరూ సమానంగా పంచుకోవాలి, అమ్మాయిల విద్యకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి అని , సమ్మతి అనే సున్నితమైన అంశాన్ని పిల్లలకు చిన్నప్పటి నుండే ఇతరుల సరిహద్దులను గౌరవించడం నేర్పాలి అని తెలిపారు.ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని,వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకోవద్దని అవగాహన కల్పించాలి , టీనేజ్ సపోర్ట్ విషయాలలో తల్లిదండ్రులు పిల్లల అలవాట్లు, భావాలను గమనిస్తూ అండగా ఉండాలి అని అన్నారు.మనం బాధ్యతాయుతమైన పౌరులుగా మారినప్పుడే వివక్ష లేని, భద్రతతో కూడిన సమాజాన్ని నిర్మించగలం అని హితవు పలిబాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బాలలపై లైంగిక దాడులు బాల కార్మిక వ్యవస్థ బాలల అక్రమ రవాణా నిర్మూలనకు నిరంతరం పనిచేసే చైల్డ్ లైన్ 1098 కు ఫోన్ చేసి తెలిపి బాలలను రక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ హెచ్ టి యు బాధ్యులు ఇన్స్పెక్టర్ శివనాథుల శ్రీనివాస్ ,ఏ హెచ్ టి యు భాస్కర్, ఏ ఎస్ ఐ జ్యోతి,కానిస్టేబుల్స్ రుక్మిణి ,రాణి ,ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు

## రెండు ఫోటోల నిబంధనతో కుంటు పడిన ఉపాధి హామీ పనులు

- కల్లూరు మండలంలో ఉపాధి హామీ కూలీల ఆవేదన



**కల్లూరు, ఏప్రిల్ 28 : ప్రజా జ్యోతి** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కొత్తగా తీసుకొచ్చిన రెండు ఫోటోల నిబంధన కల్లూరు మండల వ్యాప్తంగా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పని ప్రారంభానికి ముందు ఒక ఫోటో, పని ముగిసిన తర్వాత మరో ఫోటో ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధనతో ఉపాధి పనులు నిలిచిపోతున్నాయి. అసలు సమస్య ఏంటి నెట్‌వర్క్ లేక ఇబ్బంది మండలంలోని పలు గ్రామాల పని ప్రదేశాల్లో సరైన సిగ్నల్ ఉండడం లేదు. దీంతో ఫోటోలు అప్‌లోడ్ కాక మేట్లు నానా తంటాలు పడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ కొరత చాలా మంది మేట్ల దగ్గర స్మార్ట్‌ఫోన్లు లేవు. ఉన్నవారికి యాప్ వాడకంపై అవగాహన లేదు. ఈ విధానంలో కూలీలకు నష్టం ఉదయం ఫోటో పడినా, సాయంత్రం నెట్‌వర్క్ లేక ఫోటో అప్‌లోడ్ కాకపోతే ఆ రోజు హాజరు పడడం లేదు. దీంతో కూలీలకు వేతనం అందని పరిస్థితి. కూలీల ఆవేదన పొద్దున నుంచి సాయంత్రం దాకా ఎండలో పనిచేసినా, ఫోటో పడలేదని హాజరు వేయడం లేదు. మా కష్టానికి ఫలితం దక్కట్లేదు అని కల్లూరుకు చెందిన ఉపాధి కూలీ లక్ష్మి వాపోయారు. పనులపై ప్రభావం రెండు ఫోటోల నిబంధన వల్ల మేట్లు పని ప్రదేశానికి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీంతో మండలంలో చెరువుల పూడికతీత, కందకాల తవ్వకం, రోడ్ల మరమ్మతు లాంటి పనులు కుంటుపడ్డాయి. ఇప్పటికే వేసవిలో పనులు తగ్గగా, ఉన్న పనులు కూడా ముందుకు సాగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారుల స్పందన దీనిపై ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ, పారదర్శకత కోసమే ఎన్ ఎం ఎస్ విధానం తెచ్చారు. నెట్‌వర్క్ సమస్య ఉన్న చోట ఆఫ్‌లైన్‌లో ఫోటో తీసి, తర్వాత అప్‌లోడ్ చేసే వెసులుబాటు ఉంది. మేట్లకు శిక్షణ ఇస్తున్నాం అని తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం సమస్య తీరడం లేదు. నిబంధనలను సడలించి, నెట్‌వర్క్ లేని గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కూలీలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే మండలంలో ఉపాధి హామీ పనులు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మత్రు నాయక్



**కారేపల్లి, ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని దుబ్బతండ గ్రామపంచాయతీ బస్‌స్టాండ్ సెంటర్ లో మంగళవారం చలివేంద్రాన్ని సర్పంచ్ ఆంగోతు మాత్రు నాయక్, కార్యదర్శి రఘులు ప్రారంభించారు. వేసవి ఎండల దృష్ట్యా, ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ మత్రు నాయక్ తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో భూక్య లచ్చిరాం,బానోతు శ్రీరాం,మలోతు డకు,లక్ష్మం,నంద,గనేష్, బాబురావు,రవి,రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది మహేష్, రవి,హిట్లర్,రమేష్, బిల్ తీ, తదితరులు పాల్గొన్నారు.